క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం కావడంతో ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో దివ్యాంగురాలు దస్తగిరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మహేశ్వరి

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన దివ్యాంగురాలు దస్తగిరమ్మ అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మహేశ్వరి అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు

శిరివెళ్ల: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పీఆర్ ఏఈ రవికుమార్ ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు శిరివెళ్ల, యర్రగుంట్ల, కామినేనిపల్లె, గంగవరం, బోయలకుంట్ల, వెంకటాపురం, వీరారెడ్డిపల్లెలో సిమెంట్ రోడ్లు వేయనున్నామన్నారు. ఇందుకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపామని చెప్పారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో కూడా రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీలు అందజేయాలని సూచించారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు.

గోస్పాడు: మండలంలో రైతులకు 9గంటల పాటు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను రెండు గ్రూపులుగా విభజించినట్లు చెప్పారు. ఏ గ్రూపులో ఒంటి వెలగల ఫీడర్ కింద ఎం.కృష్ణాపురం, యాళ్లూరు ఫీడర్ల కింద, దీబగుంట్ల సబ్ స్టేషన్ పరిధిలో చెన్నూరు, నాగులవరం, దీబగుంట్ల ఫీడర్ల అలాగే బి గ్రూపులో గోస్పాడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఎం.చింతకుంట్ల ఫీడర్ కింద, సత్యనారాయణాపురం ఫీడర్ కింద, దీబగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో మసీదుపురం, మోతుకుల పల్లె ఫీడర్ల కింద ఉదయం 6 నుంచి సాయంత్రం 3గంటల వరకు సోమవారం నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

ధరలు తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ విధానం వల్ల రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెంచిన ధరలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాల పేరుతో మోదీ అధికారంలోకి వచ్చి, ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా పెంచిన ధరలు, కరెంట్ చార్జీలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేఎండీ గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మరోసారి ఎలుగు సంచారం

మహానంది: మహానంది గ్రామ పరిసరాలను ఎలుగుబంటి వదిలివెళ్లడం లేదు. ఇప్పటికే ఈశ్వర్‌నగర్ కాలనీతో పాటు ఆలయ ప్రాంగణంలోని నంది విగ్రహం, కరివేన సత్రం వరకు వచ్చిన ఎలుగుబంటి తాజాగా ఆదివారం రాత్రి మరోసారి దేవస్థానం కాలనీలోని చివరి వీధిలోకి వచ్చింది. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగి లక్ష్మయ్య ఇంటి పరిసరాల్లోకి రాత్రి ఎలుగుబంటి రావడంతో స్థానికులు ఈలలు, కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని లక్ష్మయ్య తెలిపారు.



రూపనగుడి చెరువు అలుగు ప్రవహిస్తున్న దృశ్యం



ఉధృతంగా ప్రవహిస్తున్న గాడిదొంక



దొర్నిపాడులోని ఏడుగాండ్ల మోరివద్ద కనుచూపు మేర కనిపిస్తున్న వర్షపునీరు



శెట్టివీడు వద్ద పొంగిపొర్లుతున్న అడ్డవాగు



కలుగొట్లపల్లె వద్ద నీట మునిగిన పంటను చూపుతున్న రైతు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- కరుణించిన వరుణుడు
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కుండపోత
- ఫలించిన ప్రార్థనలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ
- పొంగి పొర్లిన వాగులు, వంకలు



ఇంజేడు సమీపంలో కుందరవాగుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు





చింతల చెరువు సమీపంలో నీట మునిగిన వరి పంట



చాగలమర్రి: రాజోలి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు

దొర్నిపాడు: వర్షాకాలం ప్రారంభమైనా సరైన వర్షం లేక.. అరకొర వానలకు పంటలు సాగు చేశారు. అయితే దాదాపుగా నెలపాటు చినుకు జాడ కరువవడంతో పంటలు వాడుదశకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల రైతులు పంటలను తొలగించారు కూడా. వర్షం కురిపించాలని చాలా గ్రామాల్లో ప్రజలు వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు సైతం చేశారు. ఇక ఆశలు అడుగంటినట్లేననుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా ఎలాంటి సూచనలు లేకుండా భారీ వర్షం కురిసింది. ఎంతలా అంటే.. కుందూ నది నిండుగా ప్రవహించేలా.. వాగులు, వంకలు పొంగిపొర్లేలా.. పొలాల్లో పైర్లు నీట మునిగేంతలా.. తమ ప్రార్థనలు ఫలించడంతో అన్నదాతల్లో ఆనందానికి హద్దులు లేవు. శనివారం రాత్రి కురిసిన వర్షం మండలంలో 79.4మి.మీ.గా నమోదైందని అధికారులు తెలిపారు. కుందూ నది క్రిష్టిపాడు వద్ద బ్రిడ్జిని తాకుతూ పారుతోంది.

ఉయ్యాలవాడ : వరుణ దేవుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. మండలంలో 100.02ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి, మినుము, కంది, మొక్కజొన్న, వరి, తదితర పంటలు 1,134 హెక్టార్లలో సాగయ్యాయి. ప్రస్తుతం ఈ వర్షం పైర్లకు ఊపిరి పోసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులన్నీ జలమయ్యమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో ఇంజేడు సమీపంలో కుందరవాగు, కోవెలకుంట్ల, జమ్మలమడుగు ప్రధాన రహదారిలో అల్లూరు సమీపంలో లోలెవెల్ వంతెనలపై ఉధృతంగా వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

రుద్రవరం: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాడు ముఖం పట్టిన పంటల్లో కళ సంతరించుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కాస్త ఆలస్యం అయినప్పటికీ మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు బోరు బావుల కింద వరి పంట సాగు చేశారు.అలాగే అరకొరగా కురిసిన వర్షానికి మినుము,మొక్కజొన్న,కంది వంటి పంటలు సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో సాగు చేసిన పంటలు వాడు ముఖం పట్టాయి. దీంతో ఈ ఏడాది నష్టాలు తప్పవని రైతుల్లో ఆందోళన నెలకొంది. మినుము పూత,పిందె,మొక్క జొన్న కంకి,గింజ దశలో ఉన్నాయి.అలాగే గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరిగి ఉక్క పోతలతో ప్రజలు అలమటిస్తున్నారు. అలాంటి సమయంలో దాదాపు 44 మి.మీ వర్షం కురవడంతో హమ్మయ్య రైతులు,ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

చాగలమర్రి: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షం 10 సెం.మీ. నమోదైందని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద వక్కిలేరు వాగు 33 వేల క్యూసెక్కుల నీటితో పరవళ్లు తొక్కుతుంది. ఈ ఆనకట్ట పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం సుమారు 50 వేల క్యూసెక్కులు. అయితే నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో నీటిని దిగువకు వదిలామని అధికారులు తెలిపారు. మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పంట పొలాల్లో వర్షపు నీరు చేరి పైర్లు నీట మునిగాయి. చాగలమర్రి నుంయి కలుగొట్లపల్లె , బ్రాహ్మణపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వంతెనలపై వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహించగా, శెట్టివీడు గ్రామం వద్ద అహోబిళం వెళ్లే మార్గంలో అడ్డవాగు ఉప్పొంగి ప్రవహించింది.

గోస్పాడు: మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షం పంట పొలాలను ముంచెత్తింది. 112 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.రాయపాడు, తేళ్లపురి, ఎస్.కూలూరు, గోస్పాడు, పసురపాడు, జూలేపల్లె, ఒంటివెలగల గ్రామాల్లోని పంట కాల్వలు, పొలాలు, వర్షపునీటితో ఉధృతంగా ప్రవహించాయి. మిరప, మినుము, వరి, సోయాబిన్, మొక్కజొన్న, ఎస్.కూలూరు అరటి తోటల్లో వర్షపునీరు భారీగా చేరింది.

ఖరీఫ్ పంటలకు ఊపిరి..

నంద్యాల(అర్బన్): శనివారం రాత్రి కురిసిన వర్షం నంద్యాల మండలంలో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊపిరి పోసింది. మండలంలో 7,665 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 1,251 హెక్టార్లలో వరి, మినుము, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలను సాగు చేశారు. రెండు మాసాలుగా సరైన వర్షాలు లేకపోవడం, ప్రధాన కాల్వలకు నీరు రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పంటలు ఎండుదశకు చేరాయి. ఇటీవల కేసీ కెనాల్, ఎస్సార్బీసీ కాల్వలకు నీటిని వదిలినా చివరి ఆయకట్టుకు నీరు అందలేదు. దీంతో దిగాలు పడ్డ రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు ఉన్నాయని సంబంధిత అధికారులు పేర్కొంటుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



తేళ్లపురి సమీపంలో నీట మునిగిన మిరప పైరు



కేపీ తండా వద్ద వర్షపు నీటిలో మునిగిన వరి పైరు



ముకుందాపురం వద్ద కళకళలాడుతున్న వరి పంట



పేరూరు వద్ద పచ్చగా మినుము పైరు



డబ్ల్యూ గోవిందిన్నెలో నీటమునిగిన మినుము పంట

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 18వ తేదీన జరిగే గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు గంగిశెట్టి విజయ్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో పట్టణ వినాయక విగ్రహ మండపాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విగ్రహాలు తక్కువ ఎత్తులో ఉండే విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనం రోజున ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. చివరి రోజున వీలైనంత త్వరగా నిమజ్జనానికి బయల్దేరాలని, విద్యుత్ అలంకరణ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద భక్తిభావంతో కలిగే వాతావరణం కల్పించాలని చెప్పారు. 15వ తేదీన విగ్రహ నిర్వాహకులు కేంద్ర సమితి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, అనంతరం పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సభ్యులు నెరవాటి అమర్నాథ్, నాగేంద్ర, చలంబాబు, రవీంద్రనాథ్, సత్యనారాయణ, శంకర్, పుల్లయ్య, హరిబాబు, వీరన్న, మోహన్‌గుప్త పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానందీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: శ్రావణమాసం, పెళ్లిళ్లు ఉండటంతో పాటు సెలవురోజు కావడంతో క్షేత్రానికి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు ఇరవైకి పైగా వివాహాలు ఉండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఉదయం అష్టవిధ మహామంగళహారతుల నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. వివిధ ఆర్జిత సేవాటికెట్లు, వసతి గృహాలు, ప్రసాదాల విక్రయం తదితర విభాగాల ద్వారా ఒకే రోజు సుమారు రూ. 7లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, దేశ జనాభాలో 30 సంవత్సరాల వయస్సులోపు యువత 60 శాతం ఉన్నారని, ఉన్నత చదువులు చదివి కూలీ పనులకు వెళ్తున్నారని డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు టి.రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యారంగం, నిరుద్యోగంపై సదస్సు నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, లక్ష్మణ్, శివ, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్ మాట్లాడుతూ 1.50కోట్ల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. దేశంలో నిరుద్యోగ వ్యవస్థ 7శాతానికి పైగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల కష్టాలు తీర్చడం కోసం బీజేపీ ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శించారు. పోస్టులను భర్తీ చేయకపోవడంతో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ రంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు.

దూదేకులకు రిజర్వేషన్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): నూర్‌బాషా దూదేకులకు బీసీ కమిషన్ ప్రకారం బీసీ–ఈ రిజర్వేషన్ 4 శాతం నుంచి 12 శాతానికి పెంచి, అందులో దూదేకులకు 50శాతం భాగస్వామ్యం కేటాయించాలని, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా దూదేకుల బీసీ, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి.మస్తానమ్మ, రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్ కోరారు. ఆదివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా దూదేకుల కులస్తులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిలో 5 ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. మైనార్టీ విద్యాసంస్థల్లో దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. కళాకారులకు, కులవృత్తికి పెన్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ దస్తగిరి, ఖాదర్‌బాషా, సిద్దయ్య, ఇదాయతుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీర్ మహమ్మద్

రాజకీయ సాధికారత కల్పించాలి

నంద్యాల(అర్బన్): దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులకు రాజకీయ సాధికారత కల్పించాలని రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మేకల లింగస్వామి తెలిపారు.పట్టణంలోని ఓ హోటల్‌లో ఆదివారం దళిత,గిరిజన, బహుజన సంఘ నాయకుల సమా వేశం నిర్వహించారు.నాయకులు సీనియర్‌న్యాయవాది రాంప్రసాద్,గుర్రంలక్ష్మి, రాజ్‌కుమార్, చిరంజీవి, దేవదాస్,విజయకుమారి,ప్రవీణ్,రాజునాయక్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న దళిత, గిరిజన, బహుజన సంఘాల నాయకులు

వర్షాభావాన్ని అధిగమించిన మినుము రైతు

శిరివెళ్ల: శనివారం సాయంత్రం వరకు మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి వాతావరణంలోనూ మినుము పంట రైతులకు కలిసొచ్చింది. తక్కువ పెట్టుబడితో అడపాదడపా కురిసిన వానలకు ఆరుతడి పంటగా 509 హెక్టార్లలో మినుము సాగు చేశారు. అయితే ఇందులో ఒక్క గుంప్రమాన్‌దిన్నెలో 403 హెక్టార్లలో సాగవడం విశేషం. ఆ తర్వాత గోవిందపల్లెలో 55 హెకార్లు, యర్రగుంట్లలో 30 హెక్టార్లు, జీనేపల్లెలో 16, శిరివెళ్లలో 8 హెక్టార్లలో సాగైంది. ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. ఎకరాకు 5- 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మార్కెట్‌లో క్వింటా రూ.8 వేల నుంచి 9 వేలు ధర పలుకుతుందని రైతులు పేర్కొంటున్నారు. కాగా మినుము సాగుకు పెట్టుబడి కూడా తక్కువేనని ఎకరాకు రూ.15వేల వరకు వెచ్చించామని, ముందస్తు కౌలుకు రూ.16వేలు పోనూ దాదాపు రూ.20వేలకు పైగా మిగులుతుందని చెబుతున్నారు. మినుము కోతల అనంతరం రెండవ పంటగా జొన్న పంటను సాగు చేస్తామని పేర్కొంటున్నారు. కాగా.. గతంలో మినుము పంటలో తమకు ఈ స్థాయిలో దిగుబడి లభించలేదని మండలంలోని రైతులు తెలియజేస్తున్నారు.





గుంప్రమాన్‌దిన్నెలో యంత్రం ద్వారా మినుము పంట కోతలు , ధాన్యాన్ని కప్పలుగా పోస్తున్న దృశ్యం

మహానందిలో నిశ్చితార్థ మండపం నిర్మాణం

మహానంది: ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కళ్యాణోత్సవానికి ముందు జరిగే నిశ్చితార్థం వేడుకలకు సంబంధించిన మండపం స్థానంలో నూతనంగా నిర్మించేందుకు దాతలు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు భూమిపూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంప్రదాయం ప్రకారం పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలైన స్వామి,అమ్మవార్ల తరఫున గుండంపాడు, గుండుపాపల గ్రామాలకు చెందిన దాతలు కల్యాణంలో పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. పూర్వం నిర్మించిన నిశ్చితార్థ మండపం స్థానంలో వసతులతో కూడిన మండపం నిర్మించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు.

బృందావనం గోశాల నిర్మాణం

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు గోసేవలో భాగస్వామ్యం కల్పించడంతో పాటు గోసంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల మండలం పొన్నాపురంకాలనీకి చెందిన కంబగాని తిరుమలగౌడ్ కళావతి దంపతుల ఆధ్వర్యంలో తొమ్మిది గోవులతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక గోశాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం దాతలకు ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేసి సన్మానించారు.



నిశ్చితార్థ మండపం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం,



భూమిపూజ చేస్తున్న ఈఓ, పండితులు

మహానందీశుడి సేవలో..

మహానంది: టీవీ సీరియల్స్, కామెడీ షోల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు లభించిందని ప్రముఖ టీవీ సీరియల్స్ నటుడు సెల్వరాజ్ (చక్రవాకం ఇక్బాల్), కమెడియన్ శాంతికుమార్ అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానంది వచ్చారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. సెల్వరాజ్ మాట్లాడుతూ చక్రవాకం సీరియల్ ద్వారా అందిరికీ ఇక్బాల్‌గా సుపరిచితుడనయ్యానని, అలాగే మొగలిరేకులు సీరియల్ మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు. తమ్ముడు సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన నటించానని, ఇప్పటి వరకు సుమారు పదిహేను సినిమాలు, పదిహేను సీరియళ్లలో నటిస్తున్నానని, త్వరలో సొంత బ్యానర్‌పై సినిమా తీయనున్నట్లు చెప్పారు. సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు వారికి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేయించారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఉప్పు జగన్‌ప్రసాద్, పట్టణ నాయకులు శాంతిరాం ప్రసాద్, నూనెపల్లె దేవా, శ్రీకాంత్, గోస్పాడు గిరి పాల్గొన్నారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన నటుడు సెల్వరాజ్



మహానందికి వచ్చిన నటుడు శాంతికుమార్

వెండి పుష్పాల విరాళం

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి నారాయణ శైలేష్ 108 వెండి పుష్పాలను కానుకగా అందజేశారు. మండల కేంద్రానికి చెందిన నారాయణ శైలేష్ వ్యాపార పరంగా హైదరాబాద్ లో స్థిరపడ్డాడు. స్వామి వారికి తన వంతుగా రూ.2లక్షల విలువజేసే వెండి పుష్పాలను అందజేశారు. ముందుగా వాటికి అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారికి సమర్పించారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ, లాలం నాగార్జున, బివి బాలయ్య, తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.